నేడు బెంగాలీ నూతన సంవత్సర వేడుకలు

కొండాపూర్, ఏప్రిల్ 12 : మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం బెంగాలీ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 'పొయిలా బోయిషాక్' వేడుకలను నిర్వహించనున్నట్లు శిల్పారామం యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. శిల్పారామం, ఉత్తరాన్ బంగియా సమితి సంయుక్త ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు, బొంగో మేళాతో పాటు బెంగాలీ వంటకాలను సందర్శకులను అందుబాటులో ఉంచనున్నారు. బెంగాల్ వారసత్వాన్ని తెలిపేలా చేనేత హస్తకళా ఉత్పత్తులు సైతం అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

14న కూకట్‌పల్లిలో వైసీపీ ఆత్మీయ సమ్మేళనం

పోస్టర్ విడుదల చేస్తున్న వైసీపీ అభిమానులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 12 : కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో ఈ నెల 14న 'మేమంతా సిద్ధం' పేరుతో వైఎస్ఆర్‌సీపీ అభిమానులు,ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొండా జయవర్ధనరెడ్డి, సుబ్రమణ్యరెడ్డి, రాఘవరెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం వారు మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్య, వైద్య రంగంలో తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఏపీలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పాలన కొనసాగాలంటే సీఎం జగన్‌ను రెండో సారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో 175 సీట్ల సాధనే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో సదాశివరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చంద్రారెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం వసూలుకు 'ఎర్లీబర్డ్'

- ఏప్రిల్ 30లోగా చెల్లిస్తే... ఆస్తిపన్నులో 5శాతం రాయితీ
- మొండిబకాయిదారులు, చెక్‌బౌన్స్‌లపై స్పెషల్ ఫోకస్

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 12 : జీహెచ్ ఎంసీ పరిధిలోని భవన యజమానులకు అధికారులు బంపర్ ఆఫర్ ప్రకటించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది ఎర్లీబర్డ్ పథకాన్ని అమలుపరుస్తూ ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి 5శాతం రాయితీ అవకాశం కల్పించింది. 2024-25 వార్షిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఏప్రిల్ 30 లోగా చెల్లించి రాయితీ పొందాలని కోరుతుంది. ఇప్పటికే ఎర్లీబర్డ్ ఆఫర్‌పై కాలనీలు, బస్తీల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సకాలంలో పన్నులు చెల్లించాలని కోరుతున్నారు. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్లతో పాటు మీ సేవ, ఈ సేవ, జీహెచ్ఎంసీ సిటిజన్ సర్వీస్ సెంటర్లు, ఎంపిక చేసిన బ్యాంకుల్లో ఆస్తిపన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించింది. పాత బకాయిదారులు ఎర్లీబర్డ్ ఆఫర్‌లో అర్హులు కారని స్పష్టం చేసింది. 'ఎర్లీబర్డ్' లక్ష్యాన్ని చేరుకునే దిశగా కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల రెవెన్యూ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.

ఎర్లీబర్డ్ లక్ష్యం రూ.90 కోట్లు..

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో ఎర్లీబర్డ్ ఆఫర్‌లో రూ. 90 కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. మూసాపేట సర్కిల్‌లో రూ.40 కోట్లు, కూకట్‌పల్లి సర్కిల్‌లో రూ. 40 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మూసాపేటలో 13 డాకెట్లకుగాను 73,741 అసెస్‌మెంట్లు.. కూకట్‌పల్లి సర్కిల్‌లో 15 డాకెట్లకుగాను 82,058 అసెస్‌మెంట్లు ఉన్నాయి. గతేడాది ఎర్లీబర్డ్ ఆఫర్‌లో సుమారు రూ.80 కోట్లు వసూలు కాగా ఈ ఏడాది వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఒక్కొక్క సర్కిల్‌లో రూ. 10 కోట్ల చొప్పున రెండు సర్కిళ్లలో కలిపి ఎర్లీబర్డ్ ఆఫర్ కింద రూ.20 కోట్లకుపైగా ఆస్తిపన్ను వసూలైంది. వందశాతం ఆస్తిపన్ను రాబట్టే దిశగా ప్రణాళికాబద్ధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

కూకట్‌పల్లిలోని జీహెచ్ఎంసీ జంట సర్కిళ్ల కార్యాలయం

మొండి బకాయిలపై స్పెషల్ ఫోకస్..

గతేడాది ఆస్తిపన్ను చెల్లించని మొండి బకాయిలపై దృష్టి సారిస్తున్నాం. చెక్‌బౌన్స్ కేసులు, పెద్ద మొత్తంలో బకాయిలున్నవారిని గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నాం. కొత్త భవనాలను గుర్తిస్తూ ఆస్తిపన్ను వేయడం, ఇప్పటివరకు ఉన్న భవనాల స్థితిగతులను పరిశీలించి పన్నులు వేయడంలో మదింపు చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించాం. ఎన్నికల పనులు ఉన్నా వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు చేపట్టాం.

– కృష్ణయ్య, డీసీ, కూకట్‌పల్లి

ఎర్లీబర్డ్ ఆఫర్‌ను వినియోగించుకోవాలి..

ఎర్లీబర్డ్ ఆఫర్‌ను ప్రజలంతా వినియోగించుకుని 5శాతం రాయితీ పొందాలి. ఈ ఏడాది చెల్లించాల్సిన ఆస్తిపన్ను ఈనెల 30 లోగా చెల్లిస్తేనే 5 శాతం రాయితీ వర్తిస్తుంది. పాత బకాయిలకు రాయితీ అవకాశం లేదు. పెద్ద మొత్తంలో పన్ను చెల్లించాల్సిన వారు ఎర్లీబర్డ్ ఆఫర్‌లో చెల్లిస్తే మంచి రాయితీని పొందవచ్చు. ప్రజలు సహకారం అందించి సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి.

– రమేశ్, డీసీ, మూసాపేట

బీఆర్ఎస్ పార్టీది.. ప్రజాపక్ష పోరాటం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి
- గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే ఎక్కువ మెజారిటీ సాధిస్తామని ధీమా

మల్కాజిగిరి డివిజన్ నాయకుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మల్కాజిగిరి, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతోందని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఆర్‌కే నగర్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి డివిజన్ నాయకుల సమీక్ష సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేద బడుగు వర్గాల కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి సంక్షేమ పథకాలు అమలుపరిచిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. గత ఎన్నికల ప్రచారంలో కల్లబొల్లి మాటలు చెప్పడంతో పాటు ఆరు గ్యారెంటీలను అమలుపరుస్తామని అబద్ధ మాడరన్నారు. అయితే, దరఖాస్తు చేసుకున్న వారికి 200 యూనిట్ల విద్యుత్ ఉచిత విద్యుత్ ఇస్తామని, ఇప్పుడు బిల్లులు పంపిస్తున్నారని పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి తర్వాత మల్కాజిగిరి గడప తొక్కలేదన్నారు. ఎంపీ ల్యాండ్ నిధులు మంజూరు చేయలేదని, దీంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను నేరవేర్చిందని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరిలో 50,177 ఓట్ల మెజారిటీ వచ్చిందని, ఎంపీ ఎలక్షన్‌లో అంతకంటే ఎక్కువ ఓట్లు వేయడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ కుట్రలను తెలియజేయాలని, ఎంపీగా గెలిచి బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మల్కాజిగిరి సీటు గిఫ్ట్‌గా ఇద్దామని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, జేఏసీ వెంకన్న, ఖలీల్, బాబూరావు, తుపాకుల జనార్దన్, కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, సుధాకర్, కోటేశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఎమ్మెల్సీ సత్కారం

బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, తదితరులు

దుండిగల్, ఏప్రిల్ 12 : ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజును శుక్రవారం నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బొరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శుభకార్యాలకు హాజరు కావాలంటూ పలువురు ఎమ్మెల్సీకి ఆహ్వానం పలికారు.

తప్పిపోయిన బాలిక.. కుటుంబసభ్యులకు అప్పగింత

బాలికను కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసు

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 12 : ఇంటినుంచి బయటకు వచ్చిన బాలికను జగద్గిరిగుట్ట పోలీసులు గురువారం కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట సోమయ్యనగర్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం నాలుగేళ్ల బాలిక ఒంటరిగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాలికను విచారించగా తనపేరు రాధిక అని మాత్రమే చెప్పింది. దీంతో పోలీసులు స్థానికంగా ఉన్న వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో సమాచారం వైరల్ చేశారు. జగద్గిరిగుట్ట రింగు బస్తీకి చెందిన లక్ష్మి కూతురుగా బాలికను గుర్తించి సాయంత్రం బంధువులకు అప్పగించారు. నడుచుకుంటూ బయటకు వచ్చిన బాలిక ఇంటికి వెళ్లే దారి తెలియక తప్పిపోయిందని తెలిపారు. ఎస్ఐ శంకర్, పోలీస్ బృందాన్ని స్థానికులు అభినందించారు.

14న సితార్ ఫర్ మెంటల్ హెల్త్

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: సుప్రసిద్ధ సితార్ వాద్యకారుడు, సంగీత దర్శకుడు రిషబ్ రిఖిరామ్‌శర్మ ఈనెల 14న మాదాపూర్‌లోని డిస్ట్రిక్ట్ 150లో ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారు. శుక్రవారం ఎర్రమంజిల్‌లోని మెర్క్యూర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శర్మ మాటాడారు. సంగీతం ద్వారా అనేక రుగ్మతలను నయం చేయవచ్చని పురాతన కాలం నుంచి మనమంతా వింటున్నట్లు గుర్తుచేశారు. మానసిక ప్రశాంతత లోపించడం వల్ల అనేక రకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నవారి సంఖ్య ఎక్కువైందని, వారికి స్వాంతన చేకూర్చాలన్న లక్ష్యంతో మూడేండ్లుగా తాను దేశవ్యాప్తంగా 'సితార్ ఫర్ మెంటల్ హెల్త్' పేరుతో కచేరీలు నిర్వహిస్తున్నానని వెల్లడించారు.

రాజ్యాంగాన్ని కాపాడుదాం.. దేశాన్ని రక్షిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ పద్మజాషా

ఖైరతాబాద్, ఏప్రిల్ 12 : రాజ్యాంగాన్ని కాపాడుదాం.. దేశాన్ని రక్షిద్దాం అని పలువురు వక్తలు నినదించారు. శుక్రవారం లడ్డీకాపూల్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అధ్యక్షతన ఏప్రిల్ 2 నుంచి 14వరకు ప్రజా చైతన్యంలో భాగంగా 'రాజ్యాంగాన్ని కాపాడుదాం.. దేశాన్ని రక్షిద్దాం' అంశంపై సభ నిర్వహించారు. వక్తలుగా ప్రబుద్ధ భారత్ అడ్వైజర్ పీఎస్ఎన్ మూర్తి, విశ్రాంత ప్రొఫెసర్ పద్మజాషా, ప్రముఖ రాజకీయ విశ్లేషకురాలు కృష్ణకుమారి హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ.. రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉందని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవ హక్కులను కల్పించిన రాజ్యాంగాన్ని అవమానించాలని కొన్ని హిందుత్వ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఎప్పటికప్పుడు ప్రజలు అప్రమత్తతో ముందుకు సాగుతూ.. ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని పరిరక్షించుకోవాలంటే బాబాసాహెబ్ అంబేద్కర్ అహర్నిశలు శ్రమించి రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశాన్ని సురక్షితంగా ఉంచుకోగలమని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత స్త్రీశక్తి జాతీయ, రాష్ట్ర కోఆర్డినేటర్లు, పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

వాటర్ డ్రైన్ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

మల్లాపూర్, ఏప్రిల్ 12: మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ జె.ప్రభుదాస్ అన్నారు. ఆయన డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో జరుగుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైపులైను పనులను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జరుగుతున్నటువంటి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు ఉల్లెం బాల్‌రాజ్, శేఖర్ గౌడ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్లకు శుభాకాంక్షలు

కూకట్‌పల్లిలో మేడ్చల్ జిల్లా బీజేపీ కన్వీనర్, కో కన్వీనర్లను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 12 : బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అర్బన్ కన్వీనర్‌గా మల్లారెడ్డి, కో కన్వీనర్లుగా పద్మయ్య, ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. శుక్రవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో కన్వీనర్, కోకన్వీనర్లుగా నియమితులైన వారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీని బలోపేతం చేసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు శంకర్ రెడ్డి, కన్వీనర్ శ్రీకర్‌రావు, ప్రీతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

యాకయ్య(ఫైల్)

కొండాపూర్, ఏప్రిల్ 12 : ఇంట్లో చెప్పకుండా బయటకెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న యాక య్య మద్యానికి బానిసై రెండేండ్లుగా ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. గురువారం ఉదయం భార్య ధనలక్ష్మి తాను ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి వెళ్తూ భర్త యాకయ్యను కూడా ఉద్యోగానికి వెళ్లాలని కోరింది. గంట తర్వాత ఫోన్ చేసి వెళ్లావా? అని అడుగగా, వెంటనే కాల్ కట్ చేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో చుట్టుపక్కల వారిని, తెలిసిన వారిని ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో అతడి భార్య ధనలక్ష్మి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు తులసినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

అల్లాపూర్, ఏప్రిల్ 12 : తులసినగర్‌లో శ్రావణి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనుట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 990877 4837 నంబర్‌లో సంప్రదించాలని నిర్వహకులు వెల్లడించారు.

ముగిసిన ఆలయ కమిటీ పదవీ కాలం

శామీర్‌పేట, ఏప్రిల్ 12: శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ పదవీ కాలం ముగిసిందని ఆలయ ఈవో శ్రీనివాస్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పదవీ కాలం ముగిసిపోవడంతో అధికారులు నూతన కమిటీ ఎన్నికను త్వరలో నిర్వహించనున్నారు.

ఓల్డ్‌బోయిన్‌పల్లిలో పటిష్టంగా బీఆర్ఎస్

- ఒకరిద్దరు పార్టీ వీడినా నష్టంలేదు..
- డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇర్ఫాన్, హరినాథ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఓల్డ్‌బోయిన్‌పల్లి నాయకులు

బాలానగర్, ఏప్రిల్ 12 : ఒకరిద్దరు కార్యకర్తలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ వీడినంత మాత్రాన నష్టంలేదని, ఓల్డ్‌బోయిన్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందని ఆపార్టీ డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు ఇర్ఫాన్, మేకల హరినాథ్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ బలమైన శక్తిగా ఉందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో బీఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీని వచ్చినట్లు వారు గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి అశేష ప్రజాదరణ ఉందిని పేర్కొన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నేతృత్వంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వారి వెంట బాలరాజు, మక్కల సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వాసు యాదవ్, రాజుగౌడ్, పోచయ్య, చారి, మట్టి శ్రీను తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ సమావేశం.. గందరగోళం

- రెండు మండలాల్లో భగ్గుమన్న అసంతృప్తి
- పార్టీ ఫిరాయింపుదారులకే ప్రాధాన్యం
- జీర్ణించుకోని.. అనాదిగా జెండాలు మోసిన పార్టీ నేతలు
- అవాక్కయిన ఎంపీ అభ్యర్థి సునీతారెడ్డి, పలువురు నేతలు



పార్టీ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నాయకుడు నాగభూషణం

మేడ్చల్, ఏప్రిల్ 12: మేడ్చల్ – మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి గెలుపు కోసం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం గందరగోళంగా మారింది. పార్టీ నాయకులు, పార్టీ నేతల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. గెలుపు కోసం కార్యకర్తలను కూడగట్టాలనుకుంటే.. ఊహించిన రీతిలో నిరసన వ్యక్తం కావడంతో సునీతారెడ్డితో పాటు పలువురు నేతలు అవాక్కయ్యారు. ఎంపీ అభ్యర్థి సునీతారెడ్డి నియోజకవర్గంలోని కీసర, శామీర్‌పేట, మేడ్చల్, ఘట్‌కేసర్ మండలాల కార్యకర్తల సమావేశాల్లో మాజీ మంత్రి మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జంగయ్య యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులతో శుక్రవారం పాల్గొన్నారు. మేడ్చల్, కీసర మండల సమావేశాల్లో పార్టీ నేతలకు చుక్కెదురైంది.

కీసరలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు పంబాల రమేశ్ సమావేశానికి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, పార్టీ సీనియర్ నాయకులకు కనీస మర్యాద లేకపోతే ఎలా? అని మండిపడ్డారు. పలువురు నేతలు సర్ది చెప్పేందుకు ప్రయత్నం చేసినా శాంతించకుండా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, మేడ్చల్ మండల సమావేశంలో పార్టీ సీనియర్ నేత నాగభూషణం, మేడ్చల్‌కు చెందిన కౌన్సిలర్లను పార్టీలోకి తీసుకునేందుకు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడ్డ వారిని పార్టీలోకి తీసుకుని ప్రాధాన్యతనిస్తున్నారని, పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డామని, కేసులు సైతం ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ జెండాను వదలని తమకు సమావేశానికి సంబంధించి సమాచారం ఇవ్వపోవడం శోచనీయమని ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. పార్టీ సీనియర్ నేతలు కల్పించుకొని, ఈ విషయమై తర్వాత మాట్లాడుదామని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. రెండు చోట్ల ఎదురైన ఈ పరిణామాలతో పార్టీ నేతలు తలలు పట్టుకున్నారు.

మాదిగలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది..

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తదితరులు

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 12: మాదిగలను కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ మహాబోధి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలకు ఒక్కసీటు కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీ సోనియా, రాహుల్‌గాంధీ కూడా మాట తప్పారని అన్నారు. మన బలహీన వర్గాల బిడ్డ ఈటల రాజేందర్‌ను గెలిపించాలని, సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి, మల్కాజిగిరిలో ఈటల రాజేందర్ గెలుపుకోసం ప్రచారం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగుడుకు బానిసై వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 12 : తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. యూసఫ్‌